మర్యాదపూర్వక కలయిక



కమలమ్మకు పుష్పగుచ్ఛం అందిస్తున్న భెల్ బీఈఆర్‌పీటీయూ ప్రతినిధులు

అక్కిరెడ్డిపాలెం: జాతీయ ఎస్సీ కమిషన్ మాజీ సభ్యురాలు, బీఈఆర్‌పీటీయూ గౌరవ అధ్యక్షురాలు పి.ఎం.కమలమ్మను భెల్ ఎంప్లాయిస్ రైట్ ప్రొటెక్షన్ ట్రేడ్ యూనియన్ (బీఈఆర్‌పీటీయూ) ప్రతినిధులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. విశాఖ పర్యటనకు విచ్చేసిన ఆమెను ఎయిర్‌పోర్టులో కలిసి, భెల్ యూనిట్‌లో సమస్యలను తెలియజేశారు. కార్యక్రమంలో బీఈఆర్‌పీటీయూ ప్రధాన కార్యదర్శి, స్టీల్‌ప్లాంట్ మేనేజర్ అత్తోట సురేష్ బాబు, అధ్యక్షుడు కొల్లి దేముడు, ప్రతినిధులు పాల్గొన్నారు.

ఉక్కు మహిళలకు అథ్లెటిక్స్‌లో పతకాల పంట



సాధించిన పతకాలతో అంజలి, సంధ్యా రాణి

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్ మహిళలు యు.అంజలి, ఎస్.సంధ్యా రాణి అథ్లెటిక్స్ పోటీల్లో పలు పతకాలు గెలుపొందారు. ఇటీవల విశాఖ రైల్వే గ్రౌండ్స్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొన్న అంజలి 55 + కేటగిరీలో డిస్కస్ త్రో, షాట్‌పుట్, హేమర్ త్రో పోటీల్లో మూడు బంగారు పతకాలు కైవసం చేసుకున్నారు. ఎస్. సంధ్యా రాణి 40+ కేటగిరీలో జావలిన్ త్రో పోటీలో బంగారు పతకం, హేమర్ త్రో పోటీలో రజత పతకం, 100 మీటర్ల పరుగు పోటీలో కాంస్య పతకం గెలుపొందారు. దీంతో అంజలి, సంధ్యా రాణి ఫిబ్రవరి 8 నుంచి 11 వరకు హైదరాబాద్‌లోని గచ్చిబౌలి స్టేడియంలో జరగనున్న జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించారు. ఈ సందర్భంగా వీరిని జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రతినిధులు అభినందించారు.

ప్రజా సంకల్పయాత్ర ఓ సంచలనం

పెదగంట్యాడ: ప్రతిపక్ష నేత హోదాలో వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నిర్వహించిన ప్రజా సంకల్ప యాత్ర దేశ రాజకీయాల్లోనే సంచలనమని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. ప్రజా సంకల్ప యాత్ర ముగిసి ఐదేళ్లు పూర్తయిన సందర్భంగా కార్పొరేటర్ తిప్పల వంశీరెడ్డి ఆధ్వర్యంలో పెదగంట్యాడ కూడలిలో వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహం వద్ద మంగళవారం సంబరాలు చేశారు.

కేక్ కట్ చేసి, మిఠాయిలు పంచారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజల కష్టాలు తెలుసుకునేందుకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన పాదయాత్ర ఇడుపులపాయ నుంచి ఇచ్ఛాపురం వరకు సాగిందని చెప్పారు. ఈ యాత్రలో ప్రతి పేదవాడి గోడు విన్నారని, అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని అమలు చేసి ప్రజల హృదయాల్లో సుస్థిర స్థానం సంపాదించుకున్నారని వివరించారు. మార్టుపూడి పరదేశి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో కార్పొరేటర్లు బొడ్డు నరసింహపాత్రుడు, రాజాన రామారావు, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ పల్లా చిన తల్లి, నాయకులు గొందేశి మహేశ్వరరెడ్డి, గొందేశి శ్రీనివాసరెడ్డి, రోజారాణీ, గొందేశి వెంకట రమణారెడ్డి, మంత్రి శంకరనారాయణ తదితరులు పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి

చరిత్రాత్మకం

గాజువాక: ప్రజా సంకల్పయాత్ర చరిత్రాత్మకమని వైఎస్సార్‌సీపీ గాజువాక సమన్వయకర్త ఉరుకూటి రామచంద్రరావు (చందు) అన్నారు. ప్రజా సంకల్పయాత్ర ముగిసి ఐదేళ్లు పూర్తయిన సందర్భంగా పాత గాజువాకలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన కేక్ కట్ చేసి సంబరాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజన్న రాజ్యాన్ని సాధించేందుకు దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి సమాధి వద్ద 2017 నవంబర్ 6న జగన్ మోహన్ రెడ్డి పాదయాత్రకు తొలి అడుగు వేశారన్నారు. అన్ని వర్గాల ప్రజలను స్వయంగా కలిసి కష్టాలు తెలుసుకున్నారని, వారి కన్నీళ్లను తుడిచి వాటి పరిష్కారానికి భరోసా ఇచ్చారని తెలిపారు. ఆ సమస్యలను మేనిఫెస్టోలో పెట్టి అధికారంలోకి వచ్చిన వెంటనే 98 శాతం పరిష్కరించారన్నారు. అందుకే ఆయన మరోసారి ముఖ్యమంత్రిగా ఉండాలని ప్రజలు కోరుకుంటున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు బొడ్డు నర్సింహపాత్రుడు, మహ్మద్ ఇమ్రాన్, రాజాన రామారావు, ఇల్లపు వరలక్ష్మి, నాయకులు గుడివాడ లతీష్, కోమటి శ్రీనివాసరావు, మహాలక్ష్మినాయుడు, సిరట్ల శ్రీనివాస్, ఇల్లపు ప్రసాద్, పూర్ణానంద శర్మ, బొడ్డ గోవింద్, మంగరాజు, రామచంద్రరాజు, రెడ్డి జగన్నాథం, ప్రమీల, కటికల కల్పన, అండిబోయిన అప్పారావు, చిత్రాడ రమణ, శంకరనారాయణ, రావాడ శివ, షౌకత్‌అలీ తదితరులు పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న ఉరుకూటి చందు

సందడిగా సంక్రాంతి



చైతన్య పాఠశాలలో సంక్రాంతి సంబరాలు

పెదగంట్యాడ: సంక్రాంతి సంబరాలు మిన్నంటాయి. 77వ వార్డు ఇస్లాంపేట జెడ్పీ హైస్కూల్లో జరిగిన వేడుకలు పల్లె వాతావరణాన్ని పట్నానికి తీసుకువచ్చాయి. ప్రధానోపాధ్యాయిని ప్రమీల ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకలకు విద్యార్థులు సంప్రదాయ వస్త్రధారణలో హాజరయ్యారు. భోగిమంటలు వేసి సందడి చేశారు, రంగవల్లికలు తీర్చిదిద్దారు.

- 74వ వార్డు చైతన్య ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో సంక్రాంతి వేడుకలు ఘనంగా జరిగాయి.

కూర్మన్నపాలెం: కూర్మన్నపాలెంలోని రవీంద్ర భారతి స్కూల్లో సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటాయి. రంగుల ముగ్గులు, భోగిమంటలు, గాలిపటాలు, హరిదాసుల సంకీర్తనలతో తెలుగు సంస్కృతిని ప్రతిబింబించేలా ఉత్సవాలు నిర్వహించారు.



ఇస్లాంపేట పాఠశాలలో రంగవల్లికలు తీర్చిదిద్దుతూ..



రవీంద్రభారతి పాఠశాలలో సంప్రదాయ వేషధారణలో విద్యార్థులు

అదనపు నిధుల కేటాయింపునకు వినతి



కమిషనర్ సాయికాంత్ వర్మకు వినతిపత్రం అందిస్తున్న సన్యాసిరావు

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 69వ వార్డులో నూతన భవనాల నిర్మాణానికి అదనపు నిధులు కేటాయించాలని వైఎస్సార్ సీపీ వార్డు అధ్యక్షుడు, స్టేట్ సివిల్ సప్లై కార్పొరేషన్ డైరెక్టర్ బోగాది సన్యాసిరావు (సన్ని) జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మను కోరారు. ఈ మేరకు మంగళవారం ఆయన్ను కలిసి వినతిపత్రం సమర్పించారు. నాతయ్యపాలెం పంచాయతీ కార్యాలయం వద్ద కమ్యూనిటీ హాలు నిర్మాణానికి, హరిజన జగ్గయ్యపాలెంలో కల్యాణమండపానికి అదనంగా రూ.20 లక్షల చొప్పున మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు.

దేశం గర్వించదగ్గ మేధావి అంబేడ్కర్

- జోనల్ కమిషనర్ సింహాచలం
- 'సామాజిక సమతా సంకల్పం' ప్రారంభం



అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

గాజువాక: జీవీఎంసీ ఆధ్వర్యంలో సామాజిక సమతా సంకల్పం కార్యక్రమం మంగళవారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా వందడుగుల రోడ్‌లో అంబేడ్కర్ విగ్రహానికి, జోనల్ కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి జోనల్ కమిషనర్ పి.సింహాచలం పూలమాలలు వేసి, నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ అంబేడ్కర్ అత్యంత సామాన్య కుటుంబం నుంచి వచ్చి ప్రపంచం మెచ్చుకునే మేధావిగా గుర్తింపు పొందారన్నారు. తన మేధస్సుతో దేశానికి దిక్సూచిగా నిలిచారన్నారు. ఆయన ఆశయ సాధనకు అందరం కంకణబద్ధులు కావాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో ఈ నెల 18 వరకు నిర్వహిస్తున్న సామాజిక సమతా సంకల్పం కార్యక్రమాలను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ కె.రమణ తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆశయసాధనకు కృషి : ఎమ్మెల్యే

పెదగంట్యాడ: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయ సాధనకు కట్టుబడి ఉన్నామని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. పెదగంట్యాడ జంక్షన్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి ఆయన పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విజయవాడలో ఈ నెల 19న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా అంబేడ్కర్ స్మృతి వనం, 125 అడుగుల విగ్రహాన్ని ఆవిష్కరించనున్న నేపథ్యంలో ఇక్కడ ఉత్సవాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. విగ్రహావిష్కరణకు గాజువాక నుంచి వేలాదిగా తరలివెళ్లాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మార్టుపూడి పరదేశి, కార్పొరేటర్లు తిప్పల వంశీరెడ్డి, బొడ్డు నర్సింహపాత్రుడు, రాజాన రామారావు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.



అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న జెడ్సీ సింహాచలం తదితరులు



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న చందు తదితరులు

పోస్టర్ ఆవిష్కరణ

గాజువాక: ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి విజయవాడలో ఈ నెల 19న ఆవిష్కరించనున్న డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ 125 అడుగుల విగ్రహ పోస్టర్‌ను వైఎస్సార్‌సీపీ గాజువాక సమన్వయకర్త ఉరుకూటి రామచంద్రరావు (చందు) ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజ్యాంగ నిర్మాతకు భారీ విగ్రహం ఏర్పాటు చేయడంపై సర్వత్రా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయన్నారు. విగ్రహావిష్కరణ రోజు గాజువాక నియోజకవర్గంలోని అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలతో నివాళులర్పిస్తామని తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు బొడ్డు నర్సింహపాత్రుడు, మహ్మద్ ఇమ్రాన్, రాజాన రామారావు, ఇల్లపు వరలక్ష్మి, నాయకులు పాల్గొన్నారు.

యువ ఉద్యోగులపైనే స్టీల్‌ప్లాంట్ భవిష్యత్తు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ భవిష్యత్తు యువ ఉద్యోగులపై ఆధారపడి ఉందని స్టీల్‌ప్లాంట్ కోక్‌ఓవెన్స్ జనరల్ మేనేజర్ ఎం.వి.ఎస్. దుర్గాప్రసాద్ అన్నారు. విభాగంలో మంగళవారం జరిగిన యువ ఉద్యోగుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్లాంట్ ప్రస్తుతం ఉన్న క్లిష్ట పరిస్థితిని ఎదుర్కోవడానికి అందరూ సిద్ధంగా ఉండాలన్నారు. ఇందులో యువ ఉద్యోగులు ముందుండాలన్నారు. ఈ సందర్భంగా వారికి ఆయన పలు సలహాలు, సూచనలు చేశారు. అదే విధంగా ఉక్కు ఎస్సీ, ఎస్టీ గ్రీవెన్స్ రీడ్రెసల్ కమిటీ సభ్యులు బి.టి.నాయక్, విభాగం హెచ్‌ఆర్ ఇన్‌చార్జ్ డాక్టర్ రాధికలను కలిసి తమ సమస్యలను వివరించారు. సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. విభాగం ఉద్యోగులు అరవింద్ కుమార్, కొమ్ము ప్రసాద్, సురేష్ కుమార్‌ల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వై.మస్తానప్ప, ఎం.వి.వి.సత్యనారాయణ, జి.సురేష్, ఎం.సీతారామ్, ఎ.జగన్, కె.వినయ్ రాంజి, పి.సత్యనారాయణ, వెంకట రమణ, మురళీ కాశీబాబు, రవికుమార్, సుమన్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

మహోద్యమ దిశగా 'ఉక్కు' దీక్షలు



దీక్షలో పాల్గొన్న ఉక్కు పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: విశాఖ ఉక్కు పరిరక్షణ దీక్ష మహోద్యమ దిశగా మారనుందని పోరాట కమిటీ నాయకులు అన్నారు. మహనీయుల ప్రాణ త్యాగాలతో ఏర్పాటైన స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకుంటామని స్పష్టం చేశారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు మంగళవారం నాటికి 1062వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలో సంస్థకు చెందిన పలు విభాగాల కార్మికులు పాల్గొని కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పోరాట కమిటీ నాయకులు మాట్లాడుతూ ఉక్కు ఉత్పత్తికి కేంద్ర ప్రభుత్వం ఎన్ని అవరోధాలు సృష్టించినా నిలదొక్కుకుని విజయ పరంపరలో కొనసాగుతోందన్నారు. నిర్వాసితులకు, కార్మికులకు అన్యాయం చేస్తూ సంస్థను అమ్మడం దుర్మార్గమని, ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం తన ఆలోచనను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో తమ ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

సాయం చేస్తానంటూ మోసం

ఏటీఎం నుంచి రూ.1.02 లక్షల నగదు విత్‌డ్రా

కూర్మన్నపాలెం: సాయం చేస్తానని చెప్పి ఓ వృద్ధుడి వద్ద నుంచి ఏటీఎం కార్డు తస్కరించి, నగదు విత్‌డ్రా చేసిన గుర్తు తెలియని వ్యక్తిపై దువ్వాడ పోలీసులకు ఫిర్యాదు అందింది. ఇందుకు సంబంధించి దువ్వాడ సీఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాలివి.. కూర్మన్నపాలెం ప్రాంతానికి చెందిన గూడూరు స్వామిబాబు (71) ఈ నెల 5వ తేదీన స్థానిక ఎస్‌బీఐ ఏటీఎం సెంటర్‌కు నగదు కోసం వెళ్లారు. ఏటీఎంలో కార్డు పెట్టి నగదు విత్‌డ్రా చేస్తున్నా రాకపోవడంతో వెనుక ఉన్న గుర్తు తెలియని వ్యక్తి నగదు డ్రా చేసి ఇస్తానని చెప్పి, కార్డు తీసుకుని రెండు వేల రూపాయలు నగదు విత్‌డ్రా చేసి స్వామిబాబుకు ఇచ్చి, ఒరిజినల్ ఏటీఎం కార్డు స్థానంలో డూప్లికేట్ కార్డు ఇచ్చి వృద్ధుడిని పంపించి వేశాడు. అనంతరం ఒరిజినల్ ఏటీఎం కార్డును 11 సార్లు ఉపయోగించి ఒక లక్షా రెండు వేల రూపాయల నగదు విత్‌డ్రా చేశారు. మోసపోయినట్లు గుర్తించిన బాధితుడు స్వామిబాబు దువ్వాడ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వెంకన్న తిరువీధి ఉత్సవం నేడు

అగనంపూడి: ధనుర్మాసం సందర్భంగా అగనంపూడి శాంతినగర్ కాలనీలోని కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయం ఆధ్వర్యంలో బుధవారం తిరువీధి చేపట్టనున్నట్టు ఆలయ కమిటీ తెలిపింది. ఉదయం 8 గంటలకు శాంతినగర్ కాలనీ, నిర్వాసిత కాలనీల్లో ఉత్సవమూర్తులను ఊరేగించనున్నట్టు కమిటీ చైర్మన్ ఈకే చారి తెలిపారు.

శ్రీరాముని అక్షింతల ఊరేగింపు



అక్షింతలను దొంకాడ కాలనీలో ఊరేగిస్తున్న భక్తులు

అగనంపూడి: అయోధ్య రామ మందిరం నుంచి తీసుకువచ్చిన అక్షింతలను 85వ వార్డు దొంకాడ నిర్వాసిత కాలనీల్లో ఊరేగించారు. గ్రామానికి చెందిన దుర్గమాంబ ఆలయ కమిటీ, సీతారాముల ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో అక్షింతలను సీతారాముల పల్లకిలో ఊరేగించి, ప్యాకెట్లుగా తయారు చేశారు. ప్రతీ ఇంటికి వీటిని అందిస్తామని నిర్వాహకులు తెలిపారు. గ్రామ పెద్దలు కోసూరి తాతారావు, దాసరి త్రినాథ్, సన్యాసిరావు, బొబ్బరి అప్పారావు, కరణం శ్రీను తదితరులు పాల్గొన్నారు.

గాజువాక.. ప్రగతి పతాక



గాజువాక: ప్రగతిపథంలో పయనిస్తున్న గాజువాక ప్రస్తుతం కమర్షియల్‌గా విశాఖకు ప్రత్యామ్నాయంగా నిలిచింది. ఒకప్పుడు వెయ్యి గడపలతో అందరికీ తెలిసిన గాజువాక నేడు సుమారు ఐదున్నర లక్షల మంది జనాభాతో జనవాకగా మారింది.

ఇక్కడి పారిశ్రామికాభివృద్ధి, ఉపాధి అవకాశాల కారణంగా దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాలకు చెందిన వ్యక్తులు కుటుంబాలతో సహా వలస వచ్చి స్థిర నివాసాలను ఏర్పాటు చేసుకోవడంతో గాజువాక స్వరూపమే మారిపోయింది. క్రమేణా ఆ ప్రాంతం కమర్షియల్ కేంద్రంగా అభివృద్ధి చెందింది. ఆంధ్రప్రదేశ్‌లోనే అతిపెద్ద షాపింగ్ ప్రాంతంగా గుర్తింపు సాధించింది.

ఈ ప్రాంతంలో అత్యధిక కొనుగోలు శక్తి కలిగినవారు ఉండటంతో వాణిజ్య, ఆస్తి పెట్టుబడిదారులను గాజువాక ఆకర్షిస్తోంది. దీంతో కమర్షియల్ రియల్ ఎస్టేట్ ఇన్వెస్ట్‌మెంట్‌లకు సంబంధించి గాజువాక ప్రాంతంలో ఎక్కువమంది పెట్టుబడులను పెట్టడానికి ఆసక్తి చూపిస్తున్నారు. ఈ ప్రాంతంలో రియల్ ఎస్టేట్ ప్రాపర్టీని కొనుగోలు చేయడం లాభదాయకమైన పెట్టుబడిగా భావిస్తారు. ఈ ప్రాంతంలో ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లోని భారీ, మధ్య తరహా పరిశ్రమలతో పాటు వేల సంఖ్యలో చిన్న పరిశ్రమలు కూడా ఉండటంతో ఏ వ్యాపారికైనా కస్టమర్లు సులువుగా లభిస్తారు. ఈ కారణంగానే రియల్ ఎస్టేట్ వ్యాపారం బాగా విస్తరించింది. ఈ విషయాన్ని గుర్తించిన రియల్ ఎస్టేట్ సంస్థలు ఈ ప్రాంతంలో గేటెడ్ కమ్యూనిటీ వెంచర్లను సైతం వేయడానికి పోటీ పడుతున్నాయి.

షాపింగ్ హబ్

సుమారు ఐదున్నర లక్షల మంది జనం నివాసముంటున్న గాజువాక ప్రాంతం షాపింగ్ హబ్‌గా మారింది. పెద్దపెద్ద షోరూమ్‌లు, ఆభరణాల మాల్స్, షాపింగ్ మాల్స్, కార్పొరేట్ సంస్థలు రెండు నుంచి ఆరు కిలోమీటర్ల వ్యవధిలో విస్తరించి ఉన్నాయి. తలసరి ఆదాయం విషయంలో రాష్ట్రంలో గాజువాక మొదటి స్థానంలో ఉండటంతో ఆయా సంస్థలు ఇక్కడ తమ వ్యాపారాలను విస్తరిస్తున్నాయి. గాజువాక మెయిన్ రోడ్ వస్త్ర వ్యాపారానికి, ఆభరణాల షోరూమ్‌లకు కేరాఫ్‌గా మారిపోగా, బీసీ రోడ్‌లో కూడా దాదాపు అన్నీ ఆభరణాల దుకాణాలనే ఏర్పాటు చేశారు. జాతీయ రహదారిలో వివిధ కార్ల షోరూమ్‌లు, పేరెన్నికగన్న బ్రాండ్లకు సంబంధించిన వస్త్ర దుకాణాలు ఏర్పాటయ్యాయి. ఈ నేపథ్యంలో వస్త్రాలు, రెడీమేడ్ దుస్తులు, బంగారం, ఎలక్ట్రానిక్స్, జనరల్ స్టోర్స్, హోటళ్లు తదితర సంస్థల నుంచి ఇక్కడ రోజుకు ఒకటి, రెండు కోట్ల రూపాయల వరకు వ్యాపారం సాగుతుందని అంచనా. అదే దసరా, దీపావళి, క్రిస్మస్, సంక్రాంతి సమయాల్లో రోజుకు 10 నుంచి 15 కోట్ల రూపాయలవరకు వ్యాపారం సాగుతుందని వ్యాపారవర్గాల సమాచారం.

మెడికల్ హబ్

ఒకనాడు చిన్నపాటి వైద్య సేవలకు కూడా విశాఖ నగరానికి వెళ్లాల్సిన పరిస్థితి ఉన్న గాజువాకలో కార్పొరేట్ వైద్యం అందుబాటులోకి వచ్చింది. నాడు చిన్నచిన్న నర్సింగ్ హోమ్‌లతో మొదలైన ప్రస్థానం నేడు సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రుల స్థాయికి పెరిగింది. అతి సాధారణ సేవల నుంచి అత్యవసర సేవల వరకు రౌండ్ ది క్లాక్ వైద్య సేవలు అందుబాటులోకొచ్చాయి. ఆస్పత్రులే కాక అత్యాధునిక ల్యాబ్‌లు ఇక్కడ ఏర్పడ్డాయి.